
# ఒకరోజు

మునిమాణిక్యం
నరసింహారావు



ఆ రోజు ఇంటికి వచ్చేసరికి ఇల్లు ఇల్లుగా లేక నరకంలా వుంది. కాంతం ముఖం మాడ్చుకుని ఒక మూల కూర్చొని వుంది. బట్టలు ఉతకలేదు. పీటలు కడగలేదు. ఇల్లు ఊడవ లేదు. ఎక్కడివక్కడ ఒదిలే వేసింది. ఇల్లు ఈ రకంగా వుండడం, కాంతం ముఖలక్షణాలు అదో విధంగా మారటం చూచి తుపాను రాబోతున్నదని గ్రహించాను. కదిలిస్తే రేగుతుందని మెదలకుండా గదిలోని కెళ్ళి పుస్తకం తెరచి ముందరవేసుకొని కూర్చొన్నాను.

అంతకు ముందు రాత్రి కాంతానికీ నాకూ ఇంగ్లీషు పాఠం చెప్పే విషయంలో పోట్లాటవచ్చింది. స్కూలులో ఎల్లా వున్నా ఇంటి వద్ద భార్య అయినా పాఠం సరిగా వినవొద్దూ! నేను పాఠం చెబుతుంటే పులుసులో కారం వేసొస్తావని, పప్పుడి మీద మూత పెట్టి వస్తానని వెడుతుంటుంది. నాకు కోటును మెడవద్ద పట్టుకుని నడుముకు అరచెయ్యి పోటీ పెట్టి కొంచెం కులుకుతూ నడ వటం అలవాటు. ఆ అలవాటును కాంతం ఎల్లా వెక్కిరించిందో చూడండి!

ఆ పాఠంలో ఆ రోజు నా కర్మవశాత్తు టరన్ కోటు అనే పదం వచ్చింది. దానికి అర్థం చెబుతూ "దేశములో రెండు రాజకీయమైన కక్షలున్నపుడు ఒక కక్షలో కొంత కాలముండి తరువాత తన మతము మార్చుకొని మరో పక్షము చేరితే టర న్‌కోటు అంటారు" అని చెప్పాను.

ఆ మరునాడు రాత్రి "టరన్‌కోటు అంటే ఏమిటి?" అని ఆమెని అడిగాను, నాకు తెలియ దని అనవచ్చునా!

అల్లా లేచి మంచొని చిరునవ్వుతో ఆరంభిం చింది. ఏం చేస్తుందో అని నేనూ అల్లాగే చూస్తూ కూర్చున్నాను. "కోటు Turning Collar దగ్గర పట్టుకొని నడుము మీద చెయ్యేసి కులుకుతూ నడిచొ"ఇల్లా నడిచే వారిని టరన్‌కోట్సు అంటారు" అని విపరీతంగా నవ్వుతూ పాఠం వదిలేసి వెళ్ళిపో యింది, ఇంక నేనేమి పాఠం చెప్పేది! ఆ రోజు మంచి ఇంగ్లీషుపాఠం చెప్పటం మానేశాను.

అందుచేత ఏమైన కోపం వచ్చిందా అని ఆలోచి స్తుండగానే సన్నంగా కాంతం "మొన్న కొన్న గొడుగు ఏది!" అని అడిగింది. గొడుగు పోయిందని నోటితో ఎల్లా చెప్పేది!చెప్పకపోతే ఇవ్వాళ కాకపోతే రేపు తెలుస్తుంది. ఏమైనా కానీమని "పోయింది" అన్నాను.

"పోయిందీ. నేనుకొంటూనే వున్నా అయ్యయ్యో చక్కదనాల గొడుగు పోయిందీ. మీ దగ్గర వుండదు. పారేస్తారు తీసుకొని వెళ్ళవద్దు అంటే విన్నారూ? పోనీ కొన్నారు. ఏదీ! అయ్యో ముచ్చటయిన గొడుగు కళ్ళముందు కన బడుతూంది. ఎక్కడ పారేశారు – ఎవరి ముఖాన పెట్టారో!

అయిదు రూపాయిల గొడుగు! రూపాయిబెట్టి రవిక కొందామంటే ప్రాణం ఒప్పదు. ఆ అయిదు రూపాయిలు బెడితే పట్టురవిక వచ్చేదే! పది కాలాలపాటు తొడుక్కొనేదాన్ని. బియ్యంకొంటే పది రోజులు సరిపోయ్యేవి! చింత పండుకొంటే ఆరు నెలలు సరిపోయేది! రెండు వీసెల నెయ్యి వచ్చేది? రెండు వీసెల నెయ్యి బూడిదలో పోసి నట్లేగా! అబ్బ! తలుచుకొంటె గుండెలు బద్దల వుతవి. నేనేం సంసారం జేసేది. కిరసనాయిలు డబ్బా కొనేవాళ్ళం గదా. ఆ అయిదు రూపా యిలు పెట్టి – ఎందుకులెండి అనుకోటం మొన్న మా తమ్ముడు బటాణీగింజలకు కానీ అడిగితే లేదన్నారు. ఈ అయిదు రూపాయిలకు ఎన్ని బటాణీలు వచ్చేవి! ఎన్ని రోజులు తినేవాడు!

అబ్బ ఏడెట్లాబోతేనేమి నా మట్టుకు నేను హాయిగా తిని కూర్చుందామంటే ఈ చాకిరీతో నా ప్రాణాలు తెగుతున్నవి. మోపెడు బట్టలు ఉతకాలె. ఇల్లంతా ఊడవ వలె. ఏ మాత్రం మన్ను వదిలేసినా చెవులు పొగదీస్తారు. గోడలు తెల్లగా వుంచాలి. పుస్తకాలన్నీ దొంతర్లుగా బల్ల మీద ఉండాలి. లాంతర్లు గ్లాసులు ఇవన్నీ శుభ్రంగా వుండాలి.

ఇంతపెద్ద ఇల్లు ఎందుకు? ఇన్ని గదులెందుకు? ఏదో రెండు గదుల ఇల్లు పుచ్చుకొని పడి వుందా మంటే వినరూ.

తొమ్మిది గంటలకు వంట కాకపోతే గొంతు మీద కూర్చుంటారు. ఆఫీసులకు వెళ్ళిపోయిన తరవాత అయినా నడుము వాలుద్దామంటే ఒంటిగంటకు తేనీళ్ళు ఎవరు తయారుజేస్తారు? ఆ తేనీళ్ళు తాగిపోయిన తరవాత సాయంత్రం పనులు తయారవుతవి. విశ్రాంతి ఏది?

ఒక్కరోజు అయనను భార్యగాజేసి నన్ను భర్త నజేస్తే ఆ భగవంతుడు... అవుడు తెలుస్తుంది అయనకు..."

అని ఏక్ దమ్మున ఉపన్యాసం ఇచ్చింది. నేను అదంతా వింటూ ఊరుకొన్నాను. కోపం కొంత చల్లారిన తరవాత

"కాంతం అల్లా అంటున్నావేమి? ఇల్లు జూస్తే ఇంత అసహ్యంగా వుంచావు. నువ్వు అల్లాగ వున్నావు?"

"నే నీ చాకిరీ చెయ్యలేను. గొడుగులు పారే స్తుంటే సంసారం చెయ్యటం కష్టమే" అన్నది.

"గొడుగులు ఎన్నడూ పోతవా?"

"అవును. ఎన్నడూ పోనిది ఈ చాకిరీ ఒక్కటే."

"చాకిరి నీకు ఎల్లా తప్పుతుంది?"

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. నన్నేమి చేయ మంటారు. జీవితం భారం అనిపిస్తున్నది" అన్నది కాంతం.

ఇంత సామాన్యంగా పోయిందానికి నాలో నేను సంతోషించాను. ఏదో భార్య సంసారం భారం అని పించి విసుక్కున్నంత మాత్రాన నేను పాటించ నక్కరలేదనుకొన్నాను. నా మాటేమిటి, సోక్రటీసు అంత వాడికి తప్పింది కాదు.

ఒక రోజు సోక్రటీసు ఇంటికి రావటంతోనే భార్య తిట్టడం ప్రారంభించినదట. అతను ఏమన్నా మాట్లాడక ఊరుకొన్నాడు. ఆమెకు చివరకు ప్రాణం విసిగి "బెల్లంకొట్టిన రాయిలాగ మాట్లా డవేం?" అని చెంబెడు నీళ్ళు ఎత్తి అతని నెత్తిని పోసింది. అతను చాలా సంతోషించి "ఆ ఉరుములకూ మెరువులకూ ఈ కాస్త వానేనా" అనుకొన్నాడట.

నేనూ అల్లాగే అంతటితో బైట పడ్డందుకు సంతో షించి "కాంతం నేనో కబురు చెబుతా వింటావు. ఒక తమాషా జరిగింది. అదంతా నీ విషయమై" అన్నాను.

"ఏమిటి – " అన్నది కాంతం.

"నీ విషయమై ఒక కథ వ్రాశాను."

"ఏమని వ్రాశారు? ఇల్లు ఊడవదనా? లాంతర్లు శుభ్రంగా తుడవదనా? భర్తను గౌరవించదనా? కొంటెపిల్ల అనీ అల్లరి జంతువనీ గోల చేస్తుం దనీ వ్రాసి వుంటారు. బాగా తిట్టారా మీ కసి తీరేటట్లుగా? ఏమి వ్రాశారో చెప్పరేం?"

"చెప్పమంటావా?–"

"చెప్పమంటావా అంటారేమి? చెప్పివేసెయ్యండి. ఉన్నది ఉన్నట్లు పలకండి. నా తప్పులు పట్టుకోటం నన్ను తిట్టడమేగా మీరు జేసే పని – నిజం చెప్పండి" "నేనే మాటా చెప్పకముందే అనవలసిన మాటలన్నీ అనివేస్తుంటివి. విను. ఆ కథలో కాంతం అంత మంచి భార్య, సుగుణవతి, ప్రేయసి, ప్రపం చంలో లేదని వ్రాశాను" అని, చెప్పవద్దూ చేసిన పాపం? ... ఆ పళంగా ఆమె చెక్కిలిపైని ఒక్క చిన్ని ముద్దు పెట్టుకొన్నాను. సిగ్గు వచ్చింది నాకు కూడా వెంటనే అక్కడ నిలవకుండా నా గదిలోకి వెళ్ళిపోయినాను.

పదకొండు గంటలు కొట్టటంతోనే పట్టుబట్ట కట్టుకొని భోజనానికి తయారయినాను. ఇల్లు స్వర్గ తుల్యంగా వుంది. కాంతం ముఖం కార్తీక జ్యోత్స్నలను వెదజల్లుతున్నది. దుఃఖమేఘములు పటాపంచలైపోయినవి, చెంబులు తెల్లబడి వెండి చెంబులులాగ మెరుస్తున్నవి. బట్టలు పువ్వుల్లాగ ఉతికి పెట్టింది. పీటలు కడిగింది, ఇల్లు అద్దం లాగ వుంది, పుస్తకాలు చక్కగా బొత్తులు పెట్టి ఉన్నవి. ఎంతలో ఎంత మార్పు జరిగిందా అని ఆశ్చర్యం వేసింది, దేవతా సహాయం వల్ల జరి గిందా, ఇదంతా లేక మాయా అని అనిపించింది. ఈ పని అంతా గంటలో జరిగింది. పైగా వంట ఆ రోజు చక్కగా చేసింది. కూరలు అనీ చాలా కమ్మగా వున్నవి.

ముకుళిత కుసుమము వాయుచుంబనం చేత వికసించింది. చిరుకెరటాలను మలయపవనుడు ముద్దెట్టుకొంటే సంతోషంతో ఎగురుచున్నవి, వసం తునిచే ముద్దిడబడి పుష్పచయమంతా వికసిస్తున్నవి. ఈ చంద్రకాంతాన్ని ఏది వికసింపజేసింది? అని నా ప్రశ్న. ●



## ఇప్పడిప్పడే వస్తున్నాయి

హైదరాబాదు రాజధానీ నగర మైన కొత్తలో మునిమాణిక్యం వారూ జాషువాగారూ ఒక సాహిత్య సభకు వెళ్ళారు. ఆ సందర్భంలో ఇద్దరూ నగరమంతా తిరిగివచ్చి ఓ చోట పిచ్చాపాటీ మాట్లాడుకొంటున్నారు. అప్పడు జాషువాగారితో మునిమాణిక్యం వారు "ఏమండీ! మన ప్రాంతాల అట్లా ఎక్కడబడితే అక్కడ కనబ డతవి గాడిదలు. ఈ ఊళ్లో లేవ ట్లున్నవే" అన్నారు. ఆ మాటకు జాషువాగారు నవ్వి "ఏదండీ! మొన్ననేగా ఈ ఊరు ముఖ్యన గరమైంది. ఇప్పడిప్పడే వస్తున్నవి. కొన్నాళ్ళు పోతే మీకు కావలసినన్ని గాడిదలు ఇక్కడ కనిపిస్తాయి" అని వ్యంగ్యం విసిరారు.

సేకరణ : డాక్టర్ గుమ్మా సాంబ శివరావు

"మణి మాణిక్యాలు పోయినా నష్టం లేదు కానీ, ముని మాణిక్యాలు పోతే జాతికి కలిగే నష్టం అంతా ఇంత కాదు" అన్నాడొక విబుధమణి. తెలుగువాళ్ళు తమ సంపదగా, సాంస్కృతిక వారసత్వంగా, సగర్వంగా చెప్పకోగలిగిన వాటిలో, నాటికీ నేటికీ వాడని... ముని మాణిక్యం నరసిం హారావుగారి 'కాంతం కథలు' ఒకటి. దేవతలు 'త్రిదశు'లైనట్టు (మూడు పదుల వయసులవాళ్ళు) కాంతం కూడా ముప్పయేళ్ళ ముచ్చటైన తెలుగు గృహిణి. ఆమెకు వృద్ధాప్య మంటూ లేదు. కుటుంబ జీవనానికి కాంతం, కాంతా సమ్మితమైన భాష్యం చెప్పింది.

భావుక ప్రణయ జీవనానికి 'ఎంకి' అజేయ గేయ ప్రతినిధి అయితే, మధ్యతరగతి జీవితానికి కాంతం కథ ప్రతినిధి. విజయవాడ 'శ్రీ మానస పబ్లికేషన్స్'వారు మళ్ళీ మనకు కాంతం దర్శనభాగ్యం కల్గించారు. తద్వారా... మునిమాణిక్యాలను మరి మరోసారి మనకు జ్ఞాపకం చేశారు. కాంతం కథలతోపాటు, 'హాస్య కుసుమావళి'నీ, 'తెలుగుహాస్యం'నీ (మునిమాణిక్యంవే) అందించారు. ఈ తరం పాఠకులకు, కాంతం సంసార జీవితం నుంచి 'ఒక రోజు'ను అందిస్తున్నాం.

మునిమాణిక్యం నరసింహారావు

1. కాంతం కథలు వెల: రూ.25/- 2. హాస్య కుసుమావళి వెల: రూ.20/- 3. తెలుగు హాస్యం వెల: రూ.20/- ప్రతులకు: శ్రీ మానస పబ్లికేషన్స్ గవర్నర్‌పేట, విజయవాడ–2

— ఎడిటర్